ఆకాశ్ అదుర్స్

సర్ఫరాజ్ సత్తాచాటాడు.. జురెల్ జోరు కనబర్చాడు.. ఇప్పుడు అదే బాటలో ఇంగ్లండ్‌పైనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఆకాశ్ అదరగొట్టాడు. బుమ్రా గైర్హాజరీలో కొత్త బంతి అందుకున్న ఆకాశ్.. టాప్-3ని ఔట్ చేసి ప్రత్యర్థిని బెంబేలెత్తించాడు. ఆకాశ్ ధాటికి ఇంగ్లిష్ జట్టు ఒక దశలో 112/5 తో నిలిచి.. రెండొందలకు లోపే ఆలౌటయ్యేలా కనిపించింది!

ఆకాశ్‌దీప్ (3/70)

రాంచీ: సీనియర్ బ్యాటర్ జో రూట్ (226 బంతుల్లో 106 బ్యాటింగ్; 9 ఫోర్లు) సెంచరీతో చెలరేగడంతో భారత్‌తో జరుగుతున్న నాలుగో టెస్టులో ఇంగ్లండ్ మంచి స్కోరు దిశగా సాగుతున్నది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లిష్ జట్టు.. శుక్రవారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లకు 302 పరుగులు చేసింది. గత మూడు టెస్టుల్లో మూడు సార్లు బుమ్రా బౌలింగ్‌లో ఔటైన రూట్.. జస్ప్రీత్ గైర్హాజరీని పూర్తిగా సద్వినియోగ పరుచుకున్నాడు. జాక్ క్రాలీ (42; 6 ఫోర్లు, ఒక సిక్సర్), బెయిర్ స్టో (38), బెన్ ఫోక్స్ (47) పర్వాలేదనిపించారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (3), ఒలీ పోప్ (0), డకెట్ (11) విఫలమయ్యారు. మన బౌలర్లలో అరంగేట్ర పేసర్ ఆకాశ్‌దీప్ మూడు వికెట్లు ఖాతాలో వేసుకోగా.. హైదరాబాదీ సిరాజ్ రెండు వికెట్లు తీశాడు. రూట్‌తో పాటు ఓలీ రాబిన్‌సన్ (31 బ్యాటింగ్; 4 ఫోర్లు, ఒక సిక్సర్) క్రీజులో ఉన్నాడు. శనివారం మిగిలిన మూడు వికెట్లను భారత్ ఎంత త్వరగా పడగడుతుందనే దానిపైనే మ్యాచ్ గమనం ఆధారపడి ఉంది.

1

భారత్‌పై అత్యధిక (10) టెస్టు సెంచరీలు చేసిన ప్లేయర్‌గా రూట్ రికార్డు లోకెక్కాడు. స్టీవ్ స్మిత్ (9; ఆస్ట్రేలియా) రెండో స్థానంలో ఉన్నాడు.

ఒకే జట్టుపై 100 వికెట్లు, 1000 పరుగులు చేసిన తొలి భారత బౌలర్‌గా అశ్విన్ చరిత్రకెక్కాడు.

రూట్ (106*)

రూట్ అజేయ సెంచరీ

ఇంగ్లండ్ 302/7

భారత్‌తో నాలుగో టెస్టు

అయితే.. ఈ పర్యటనలో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న ఇంగ్లండ్ సీనియర్ బ్యాటర్ జో రూట్ ఎట్టకేలకు బ్యాట్ ఝుళిపించాడు. సహచరులంతా వెనుదిరుగుతున్న సమయంలో ఒంటరి పోరాటం చేస్తూ.. 'బజ్‌బాల్'ఆటతీరును పక్కన పెట్టి.. తనకు అలవాటైన టెస్టు శైలిలో గంటల తరబడి క్రీజులో పాతుకుపోయి.. జట్టును గట్టెక్కించాడు!!

చాన్నాళ్ల తర్వాత..

'టెస్టు ఫార్మాట్‌లో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ ఒక్కడు చేసినన్ని పరుగులు.. టీమ్‌ఇండియాలోని మొత్తం 11 మంది ప్లేయర్ల రన్స్ కంటే ఎక్కువే'.. టెస్టు సిరీస్ ప్రారంభానికి ముందు విశ్లేషకులు చేసిన వ్యాఖ్యలివి. అయితే గతంలో భారత జట్టుపై టన్నుల కొద్ది పరుగులు చేసిన రూట్.. తొలి మూడు టెస్టుల్లో కుదురుకునేందుకు తీవ్రంగా ఇబ్బంది పడగా.. బజ్‌బాల్ ఆటతీరు రూట్‌కు నప్పదని పలువురు సూచనలివ్వడంతో.. రాంచీలో తన సహజ శైలిలో ఆడిన రూట్ ఎట్టకేలకు సెంచరీతో కదంతొక్కాడు.'ఫామ్ తాత్కాలికం.. క్లాస్ శాశ్వతం'అనే మాటలను నిజం చేస్తూ.. కష్టాల్లో ఉన్న జట్టును ఒంటి చేత్తో ఒడ్డున పడేశాడు.

ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శన చేస్తూ.. జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న ఆకాశ్‌దీప్.. అరంగేట్రంలోనే సత్తా చాటాడు. ప్రధాన పేసర్ బుమ్రా గైర్హాజరీలో అతడి స్థానాన్ని భర్తీ చేసే పెద్ద బాధ్యతను భుజానెత్తుకున్న 27 ఏండ్ల ఆకాశ్‌దీప్.. తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించాడు. పిచ్ నుంచి లభిస్తున్న సహకారాన్ని చక్కగా వాడుకున్న ఆకాశ్‌దీప్.. తొలి మూడు వికెట్లు తీసి ఇంగ్లండ్ టాపార్డర్‌ను దెబ్బకొట్టాడు.

సంక్షిప్తస్కోర్లు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 302/7 (రూట్ 106 నాటౌట్, ఫోక్స్ 47; ఆకాశ్ దీప్ 3/70, సిరాజ్ 2/60).

బ్లాక్ హాక్స్ ఓటమి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రైమ్ వాలీబాల్ లీగ్ మూడో సీజన్‌లో హైదరబాద్ రెండో పరాజయం ఖాతాలో వేసుకుంది. చెన్నై వేదికగా జరిగిన పోరులో హైదరాబాద్ 15-17, 13-15, 11-15తో అహ్మదాబాద్ డిఫెండర్స్ చేతిలో పరాజయం పాలైంది. అహ్మదాబాద్‌కు ఇది హ్యాట్రిక్ విజయం కావడం విశేషం.

ఆసీస్‌దే సిరీస్


కమిన్స్ (28; 1/19)

ఆక్లాండ్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా.. న్యూజిలాండ్‌పై 2-0తో టీ20 సిరీస్ చేజిక్కించుకుంది. తొలి పోరులో ఉత్కంఠభరిత విజయం సాధించిన కంగారూలు శుక్రవారం జరిగిన రెండో టీ20లో 72 పరుగుల తేడాతో కివీస్‌ను చిత్తుచేశారు. మొదట ఆసీస్ 19.5 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. ట్రావిస్ హెడ్ (45) కమిన్స్ (28) రాణించారు. కివీస్ బౌలర్లలో ఫెర్గూసన్ 4 వికెట్లు తీశాడు. అనంతరం న్యూజిలాండ్ 17 ఓవర్లలో 102 పరుగులకు ఆలౌటైంది. ఫిలిప్స్ (42) ఒంటరి పోరాటం చేయగా.. ఆసీస్ బౌలర్లలో జాంపా 4 వికెట్లే పడగొట్టాడు.

ముంబై బోణీ

ఢిల్లీపై ఉత్కంఠ విజయం **డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ షురూ**

అట్టహాసంగా ప్రారంభమైన మహిళల ప్రీమియర్ లీగ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ బోణీ కొట్టింది. అతిరథ మహారథుల మధ్య ప్రారంభమైన డబ్ల్యూపీఎల్ రెండో సీజన్‌లో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని ముంబై చివరి బంతికి సిక్సర్ బాది శుభారంభం చేసింది.

బెంగళూరు: డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ డబ్ల్యూపీఎల్ రెండో సీజన్‌లో తొలి విజయం నమోదు చేసుకుంది. నిరుడు జరిగిన తొలి సీజన్‌కు మంచి ప్రేక్షకాదరణ దక్కడంతో.. ఈ సారి నిర్వాహకులు అంతకు మించిన రీతిలో ఆరంభ వేడుకలు నిర్వహించారు. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొలి పోరులో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్ 4 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. అలీస్ కాప్సీ (75; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా.. జెమీమా రోడ్రిగ్స్ (24 బంతుల్లో 42; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) దంచికొట్టింది. ముంబై బౌలర్లలో స్కీవర్ బ్రంట్, అమెలియా కెర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. చివరి బంతికి 5 పరుగులు చేయాల్సి ఉండగా.. సంజన సిక్సర్ కొట్టి ముంబైని గెలిపించింది. ఢిల్లీ బౌలర్లలో హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి, కాప్సీ చెరో 2 వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. లీగ్‌లో భాగంగా శనివారం యూపీ వారియర్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అమీతుమీ తేల్చుకోనుంది.

సంక్షిప్తస్కోర్లు

ఢిల్లీ: 171/5 (కాప్సీ 75, జెమీమా 42; స్కీవర్ బ్రంట్ 2/33), **ముంబై:** 20 ఓవర్లలో 173/6 (యస్తిక 57, హర్మన్ 55; కాప్సీ 2/23).

హర్మన్‌ప్రీత్ (55)

అట్టహాసంగా.. మ్యాచ్ ఆరంభానికి ముందు.. నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను కట్టపడేశాయి. బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్, షాహిద్‌కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా, కార్తిక్ ఆర్యన్, టైగర్ ష్రాఫ్ ప్రదర్శనలతో స్టేడియం హోరెత్తింది. అనంతరం ఐదుగురు కెప్టెన్లు ప్రత్యేక వాహనాల్లో స్టేజి మీదకు చేరుకోగా.. చివరగా వచ్చిన ముంబై ఇండియన్స్ సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ ట్రోఫీని తీసుకువచ్చింది. ఈ క్రమంలో కెప్టెన్‌లతో షారుక్‌ఖాన్ చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా, ఐపీఎల్ చైర్మన్ అరున్ ధుమాల్, రాజీవ్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సీసీఎల్ మ్యాచ్‌లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సెలబ్రెటీ క్రికెట్ లీగ్ (సీసీఎల్)కు ఆతిథ్యమిచ్చేందుకు ఉప్పల్ స్టేడియం ముస్తాబవుతున్నదని హైదరాబాద్ క్రికెటర్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు వెల్లడించారు. ఈ లీగ్ తొలి అంచె పోటీలు షార్జాలో జరుగుతుండగా.. వచ్చే నెల 1 నుంచి 3 వరకు రెండో అంచె మ్యాచ్‌లకు హైదరాబాద్ వేదిక కానుంది. ఈ లీగ్‌లో టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్, సాండిల్‌వుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు పాల్గొననున్నారు. ఈ మ్యాచ్‌లకు కళాశాల విద్యార్థులను ఉచితంగా అనుమతిస్తామని హెచ్‌సీఏ అధ్యక్షుడు తెలిపారు. ప్రతి రోజు 10 వేల మంది కాలేజీ విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి గల కళాశాలల యాజమాన్యం హెచ్‌సీఏను సంప్రదించాలని పేర్కొన్నారు. లీగ్‌లో భాగంగా హైదరాబాద్‌లో మొత్తం 6 మ్యాచ్‌లు జరగనున్నాయి. తెలుగు వారియర్స్ జట్టుకు అక్కినేని అఖిల్ సారథిగా వ్యవహరిస్తున్నాడు.

చిత్రం

ఫ్యామిలీస్టార్ సందడి షురూ?



కొన్ని సినిమాలు విడుదలకు ముందే ఆసక్తిని రేకెత్తిస్తూ వుంటాయి. అలాంటి సినిమానే విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీస్టార్'. ఈ సినిమాపై ఇంత హైప్ రావడానికి కారణం 'గీతగోవిందం' సినిమానే అని చెప్పాలి. విజయ్ దేవరకొండ హీరోగా పరశురామ్ తెరకెక్కించిన ఆ సినిమా అప్పటివరకూ దేవరకొండపై ఉన్న 'అర్జున్‌రెడ్డి' ఇమేజ్‌ని పూర్తిగా మార్చేసింది. ఓ కొత్త విజయ్‌ని తెరపై ఆవిష్కరించింది. దేవరకొండ విజయ్ కెరీర్‌లో తొలి వందకోట్ల సినిమాగా నిలిచింది 'గీతగోవిందం'. ఇప్పుడు మళ్లీ వారిద్దరి కలయికలో సినిమా అంటే అంచనాలు ఆకాశంలో ఉండటం కామనే. ఈ సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. ఏప్రిల్ 5న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్మాత దిల్ రాజు సంకల్పించిన విషయం విదితమే. అందుకే షూటింగ్‌ని శరవేగంగా పూర్తి చేసేపనిలో ఉన్నారు దర్శకుడు పరశురామ్ . విడుదలకు ఇంకా అయిదు వారాలే సమయం ఉండటంతో ప్రమోషన్స్ కూడా వెరైటీగా ప్లాన్ చేశారట దిల్ రాజు. ఓ వైపు ప్రమోషన్ పనులూ, మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు.. అన్నీ సిస్టమేటిగ్గా జరిగేలా ప్లాన్ చేశారట దిల్‌రాజు. ఇందులో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. 'గీత గోవిందం' తరహాలోనే సున్నితమైన పాయింట్‌తో.. వినోదంతో కూడిన ప్రేమకథగా ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారట పరశురామ్. ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా కట్టిపడేస్తాయని చెబుతున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె.యూ.మోహనన్, సంగీతం: గోపీసుందర్, రచన-దర్శకత్వం: పరశురామ్.

హైకోర్టులో ఊరట..

బాలీవుడ్ నటి రియా చక్రవర్తికి ముంబయి హైకోర్టులో ఊరట లభించింది. నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ 2020 జూన్ 14న అనుమానాస్పద స్థితిలో మరణించిన విషయం తెలిసిందే. అది ఆత్మహత్య కాదనీ, ముమ్మాటికీ హత్యేననీ, దీనికి కారణం రియా చక్రవర్తి, ఆమె కుటుంబ సభ్యులేనని ఆరోపిస్తూ సుశాంత్ కుటుంబసభ్యులు ముంబయిలో కేసు దాఖలు చేశారు. అంతేకాక సుశాంత్ బ్యాంక్ ఖాతా నుంచి 15కోట్లు రియా, రియా కుటుంబసభ్యులు బదిలీ చేసుకున్నారని, సుశాంత్‌కి రియా మాదకద్రవ్యాలను కూడా ఇచ్చేవారనీ సుశాంత్ కుటుంబసభ్యులు ఆరోపించారు. మనీలాండరింగ్, మాదకద్రవ్యాలు.. ఇలా పలు అంశాలపై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో ఈ విషయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రియాను ప్రశ్నించింది. కేసును సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు అదేశాలు జారీ చేయడంతో రియా, ఆమె సోదరుడు షోవిక్ చక్రవర్తి జైలుకు కూడా వెళ్లారు. ఈ క్రమంలోనే రియా కుటుంబసభ్యులు దేశం దాటి వెళ్ల కుండా సీబీఐ ఎల్‌వోసీని జారీ చేసింది. దీంతో ఇటీవలే ముంబయి కోర్టును రియా ఆశ్రయించడంతో ఆమె కుటుంబసభ్యులపై సీబీఐ జారీ చేసిన లుక్‌అవుట్ సర్క్యులర్(ఎల్‌ఓసీ)ను రద్దుచేస్తూ ముంబయి హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం అదేశాలు జారీ చేసింది. ఈ అర్డర్‌పై నాలుగు వారాలు స్టే ఇవ్వాలని, సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకునేందుకు గడువు అవసరమన్న సీబీఐ అభ్యర్థనను కూడా హైకోర్టు తోసిపుచ్చింది. ఆ విధంగా కొద్దిలో కొద్ది రియా చక్రవర్తికి ఈ కేసులో ఊరట లభించినట్టయ్యిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బిల్ కట్టిన అభిమాని



కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో సేవా కార్యక్రమాల ద్వారా అందరి మన్ననలు అందుకున్నారు నటుడు సోనూసూద్. నిస్వార్థ సేవా గుణంతో దేశవ్యాప్తంగా ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు. తాజాగా ఓ అజ్ఞాత అభిమాని సోనూసూద్‌కు సర్‌ప్రైజ్ నిచ్చారు. ఇటీవల సోనూసూద్ తన ఫ్యామిలీ మెంబర్స్‌తో కలిసి ముంబయిలోని ఓ రెస్టారెంట్‌కి వెళ్లాడు. భోజనానంతరం బిల్లు కోసం సిబ్బందిని కోరగా... మొత్తం ఫుడ్ బిల్లును ఎవరో అజ్ఞాత వ్యక్తి చెల్లించి వెళ్లాడని చెప్పారు. ఈ సంఘటనతో సోనూసూద్ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. బిల్లు కట్టిన సదరు అభిమాని 'దేశం కోసం మీరు చేస్తున్న మంచి పనులకు నా తరపున చిన్న కృతజ్ఞత ఇది' అంటూ ఓ నోట్‌ను రాసి వెళ్లాడు. ఈ విషయాన్ని సోనూసూద్ తన ఇన్‌స్టా ఖాతా ద్వారా వెల్లడించారు. 'ఈ పని ఎవరు చేశారో తెలియదు కానీ..తను నా హృదయాన్ని గెలుచుకున్నాడు' అంటూ సోనూ ఇన్‌స్టాలో పేర్కొన్నారు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మా సినిమాకు పిల్లలు రావొద్దు..

తమ సినిమాకి 'ఏ' సర్టిఫికెట్ రావడంపై 'తంత్ర' మూవీ టీమ్ స్పందించారు. మా సినిమాకు పిల్లలు రావద్దని హెచ్చరిస్తూ స్వయంగా చిత్రబృందమే పోస్టర్‌ని విడుదల చేయడం విశేషం. అనన్య నాగళ్ల ప్రధాన భూమిక పోషించిన ఈ హారర్ చిత్రంలో ధనుష్ రఘుముద్రి ఆమెకు జోడీగా నటించాడు. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకుడు. నరేష్‌బాబు పి., రవి చైతన్య నిర్మాతలు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయని, సినిమాపై అంచనాలు పెంచాయని చిత్రబృందం తెలిపింది. అతి త్వరలో ట్రైలర్‌ని, త్వరలో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. సలోని, టెంపర్ వంశీ, మీసాల లక్ష్మణ్, కుశాలిని ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సాయి రామ్ ఉదయ్, విజయభాస్కర్ సద్దాల, సంగీతం: ఆర్.ఆర్.ధృవన్.

'లైన్‌మ్యాన్' జీవిత చిత్రం

కెరీర్ ఆరంభం నుంచి విభిన్నమైన సినిమాలు చేస్తూ ప్రత్యేకతను సంపాదించుకున్నారు యువ హీరో త్రిగుణ్. ఆయన 'లైన్‌మ్యాన్' చిత్రం ద్వారా కన్నడ చిత్రసీమలోకి ఎంట్రీ ఇస్తున్నారు. వి.రఘుశాస్త్రి దర్శకత్వంలో తెలుగు, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన లైన్‌మ్యాన్ జీవితంలో చోటుచేసుకున్న ఆసక్తికరమైన సంఘటనలతో ఈ సినిమాను తెరకెక్కించాం. కర్ణాటక మాండ్య ప్రాంతంలోని గ్రామీణ వాతావరణాన్ని ఆవిష్కరిస్తుంది. ఆద్యంతం వినోదప్రధానంగా ఆకట్టుకుంటుంది' అని చిత్ర బృందం పేర్కొంది. కాజల్ కుందేర్, బి.జయశ్రీ, నివిక్ష నాయుడు, హరిణి శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శాంతిసాగర్ హెచ్.జి, సంగీతం: కాద్రి మణికాంత్, నిర్మాణ సంస్థ: పర్సల్ రాక్ ఎంటర్‌టైనర్స్, రచన-దర్శకత్వం: వి.రఘుశాస్త్రి.



డీవీవీ దానయ్య, డింపుల్ హయతి, కోటి, వి.ఎన్.ఆదిత్య తదితరులు

మార్చి 3న 'గామా' హంగామా

నాలుగవ 'గామా' అవార్డ్స్ వేడుక దుబాయ్‌లోని జబిల్ పార్క్‌లో మార్చి 3న వైభవంగా జరుగనుంది. ఏఎఫ్ఎం ప్రాపర్టీస్ సారథ్యంలో గామా అవార్డ్స్ అధ్యక్షుడు కేసరి త్రిమూర్తులు ఈ వేడుకను నిర్వహించనున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఈ వేడుకకు సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమం ఘనంగా జరిగింది. అవార్డు జ్యూరీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న సంగీత దర్శకుడు కోటి, జ్యూరీ సభ్యులు వి.ఎన్.ఆదిత్య, రఘు కుంచె, నిర్మాత డీవీవీ దానయ్య, దర్శకులు సాయిరాజేశ్, ప్రసన్న, హీరోయిన్ డింపుల్ హయతి, గామా సీఈవో సొరభ్, ఏఎఫ్ఎం ప్రాపర్టీస్ సునీల్, ఫణి మాధవ్ ఈ కార్యక్రమంలో పాల్గొని అవార్డు ట్రోఫీని లాంచ్ చేశారు. కొవిడ్ కారణంగా మూడేళ్లు ఈ వేడుకకు గ్యాప్ వచ్చిందని, ఈ సారి టాలీవుడ్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ వేడుకను కేసరి త్రిమూర్తులు నిర్వహించనున్నారని, 2021, 22, 23 సంవత్సరాలకు చెందిన చిత్రాల నుంచి వివిధ కేటగిరీలకు అవార్డులు అందజేయనున్నామని జ్యూరీ ఛైర్మన్ సంగీత దర్శకుడు కోటి తెలిపారు.

ప్రేమలో 'యానిమల్' భామ

'యానిమాల్' సినిమాతో ఒక్కసారిగా పాపులర్ అయింది త్రిప్తి డిమ్రి. చేసింది చిన్న పాత్రే అయినా యువతరంలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడికి బాలీవుడ్‌లో భారీ ఆఫర్లొస్తున్నాయి. శుక్రవారం ఈ భామ 30వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా ప్రియుడు సామ్ మర్చంట్ ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. 'నా ప్రియమైన త్రిప్తికి శుభాకాంక్షలు' అంటూ ఇద్దరూ కలిసి ఉన్న ఓ ఫొటోను షేర్ చేశారు. దాంతో ఈ అమ్మడి ప్రేమాయణం హాట్‌టాపిక్‌గా మారింది. మీ పరిచయం ఎక్కడ మొదలైంది?.. ఎన్నేళ్లుగా ప్రేమలో ఉన్నారు?.. అంటూ నెటిజన్లు ప్రశ్నలతో ముంచెత్తారు. సామ్‌మర్చంట్ తొలుత మోడల్‌గా పనిచేసి ప్రస్తుతం వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. గోవాలో అతనికి బీచ్ క్లబ్స్‌తో పాటు పలు హోటల్స్ ఉన్నాయని తెలిసింది.